# రాత్రి ఒంటి గంట

రాత్రి ఒంటిగంట అవుతుంది. అప్పుడే చిన్న వానపడి వెలిసింది గాని యింకా తుంపర్లు పడుతూనే వున్నాయి - గాలి కరుస్తున్నట్టు వీస్తూంది. చలి ఎక్కువగా ఉంది.

నిర్జనపూరు. ఒక చిన్న రైల్వే స్టేషను. రైల్వే వాళ్ళ ఉపయోగానికి దేనికో కట్టిన స్టేషను గాని, నిజానికి అక్కడ దాని అవసరం కనిపించదు; జనసంచారం అంతగా ఉండదు. అడవి మధ్య, నిర్జీవంగా భయం వేస్తున్న ఆ ప్రదేశంలో, నాలుగయిదు స్టాఫ్ క్వార్టర్సు ఉన్నాయి. అంతే.

ఒక గూడ్సు బండికి త్రూలైన్ క్లియర్ ఇచ్చేసి ఆ బండి రాకకోసం ఎదురుచూస్తూ చిన్న మేష్టరు పచ్చ దీపం పట్టుకుని పైన నిలుచున్నాడు. జమాదారు, పాయింటువాళ్ళూ ఎవరి పనిలో వారున్నారు.

ఒక రైలు, ఆ చీకటిని చీల్చుకొంటూ పెద్ద హెడ్ లైట్‌తో, ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ పెద్ద అరుపుతో రాక్షసి వదిలిన చుట్ట పొగలా పొగ వదులుతూ, కొండ చిలువలా కొంత దూరం వచ్చి, స్టేషన్‌కి చేరకుండానే ఆగిపోయింది. ఆ బండి తిన్నగా ఆగకుండా వెళ్ళిపోవలసింది! ఆ స్టేషన్‌లో దానికి పనిలేదు కాబట్టి. కాని- డ్రైవరు, పరిగెట్టుకుంటూ గాభరాగా స్టేషన్‌వైపు రావడంతో అందరికీ అనుమానం వేసింది.

ఆ డ్రైవరు 'మేష్టారూ! అవుటరు సిగ్నలుకూ, హోం సిగ్నలుకూ మధ్య ఓ మనిషి బండి క్రిందబడి రన్ ఓవర్ అయేడని చెప్పేడు పిడుగులా, అది వినగానే చిన్న మేష్టరు కంగారు పడ్డాడు.

అక్కడున్న వాళ్ళందరూ ఆ చోటుకి వెళ్ళేరు. మొగవాడు, 35 ఏళ్ళ ప్రాయం వాడు. పట్టాల మీద పడి వున్నాడు. పీకలేని మొండెం ట్రాక్‌కి కుడిప్రక్క పడి వుంది - తలకాయ పూర్తిగా తెగిపోయి రెండు లైన్లకీ మధ్య బోరగిల్లా వుంది. తల మీద ఒక గాయం వుంది. రక్తం ఎండిపోయింది! చిన్న మేష్టరు వీలయినన్ని వివరాలు - ట్రైన్ నెంబరు, గార్డు, డ్రైవర్ల పేర్లు, యింజన్ నెంబర్ మైలు నెంబరు యివన్నీ రాసుకొని.... బండిని పోనిచ్చాడు, శవాన్ని ఏ జంతువులూ ఎత్తుకు పోకుండా లేక మరేవింతలూ జరక్కుండా ఒక గ్యాంగు మనిషిని కాపలా వుంచి స్టేషన్‌కి వచ్చేసాడు.

తర్వాత దగ్గరలో వున్న జి. ఆర్. పి.కి లోకల్ పోలీస్‌కి, యింకా ఆ సంబంధం వున్న ఆఫీసర్లందరికీ వార్త పంపాడు.

తెల్లవారేసరికి, జీపుల మీద, రైళ్ళ మీద వచ్చి, ఆ స్టేషన్ లో దిగారు, ఆఫీసర్లు, పోలీసులూ. మొదట స్టేషన్‌స్టాఫ్‌ని అడిగి వివరాలు తెలుసుకొని; సైట్ దగ్గరికి వెళ్ళేరు. ఎవరికి వీలయినకోణాల్లోంచి

వారు చూశారు. ఫొటో గ్రాఫరు ఫొటోలు తీసాడు; పోలీసు ఇన్స్పెక్టర్ కర్ర ఆడిస్తూ ఆ చుట్టు ప్రక్కల, ట్రాక్ పక్కా చూస్తూ ఏవో ప్రశ్నలు అడుగుతున్నాడు. డాక్టరు వచ్చి పరీక్ష చేస్తూ -

''చూశారా ! ఇది 'రన్ ఓవర్, అన్నారు గాని కాదు;'' అని అన్నాడు. అదివిని అందరూ విస్తుపోయారు. పోలీసు ఇన్స్పెక్టరు ముందుకి ఆతృతతో వచ్చి - 'మరి' అన్నాడు.

''అసలు బండి క్రింద పడనే లేదు - చూడండి. యీ లైను మీదగాని, క్రింద స్లీపర్ల మీదగాని రాళ్ళమీదగాని ఒక్క నెత్తురు బొట్టు లేదు. మరో విషయం - పీక చక్రం క్రింద పెట్టినట్టయితే, ఆ పీక కొంతవరకూ అంటే చక్రం ఎంత మందంగా వుంటుందో - నాలుగయిదంగుళాల వెడల్పుని. ముద్దముద్దగా నలిగిపోయి వుండాలి. కాని అలాలేదు. ఎవరో కత్తితో సావకాశంగా కోసి విడదీసి యిలా పడేసినట్టు అనిపిస్తూంది. - ఆ,- కొయ్యడం కూడా యిక్కడ జరిగినట్లు లేదు - కాకుంటే - రక్తం జాడలు వుండును- ఏమంటారు ?'' అన్నాడు డాక్టరు.

దాంతో ఇన్స్పెక్టరుకి చురుకు పుట్టి - ''కరెక్ట్ నాకూ అలాగే అనిపించింది ! యింకా నిర్ధారణకి రాలేక తటపటాయిస్తున్నాను ! - యింకోటి కనిబెట్టారో లేదో - బండి క్రింద కావాలని తల పెట్టినవాడయితే, తల తెగాక కొంత సేపయినా గింజుకోక తప్పదు - ఈ శవం చూడండి ! మొండెం సాష్టాంగపడి బోరగిల్లా చెక్కు చెదర కుండా వుంది. ఆ తలకూడా అలాగే వుంది తొడుక్కున్న చెప్పులు కూడా కాళ్లనుంచి వేరు కాలేదు ! యిది చాలా వింత ! - అనగా హంతకుడో, హంతకులో - ఈ విధంగా కోసి, అమర్చి, వెళ్ళిపోయేరు! అలా చేస్తే బండి క్రింద పడి తెగిపోయాడని - అనుకుంటే పీడ వదిలిపోతుందని వాళ్ల వూహ'' అంటూ ఇన్స్పెక్టరు, తల దగ్గరికి వెళ్లి చూశాడు. తల మీద ఒక గాయం కనిపించింది.

శవం గుర్తు పట్టబడింది. అతని భార్య, తదితర బంధువులూ వచ్చి, ''మొన్న రాత్రి మూడు గంటల బండిలో ప్రక్కవూరి సంతకి వెడతానని - స్టేషన్ దూరం కాబట్టి, రాత్రి సమయం కాబట్టి, రాత్రి ఎనిమిదింటికే బయలుదేరి యింటినుండి వెళ్లిపోయేడని - ఆ తర్వాత యీ ఘోరం తెలిసిందని'' చెప్పారు.

చుట్టు ప్రక్కల ఏదయినా గ్రామాలున్నాయేమో అని కనుక్కోగా, ఆ స్టేషన్ చుట్టూ రెండు మూడు మైళ్ళ కైవారంలో మూడు నాలుగు పల్లెటూళ్లు వున్నట్లు తెలిసింది. ఇంకేం పోలీసు మూక ఆ వూళ్ళ మీద పడింది. వీళ్లని ఆ ప్రజలు ఎంత వింతగా చూశారో ! ఆ వూళ్లూ అంతే వింతగా వున్నాయి, అందరూ వ్యవసాయం వృత్తిగా పెట్టుకు బ్రతుకుతున్నారు ! ఏ వూళ్లోనూ ఒక బీడీ దుకాణమయినా లేదు. అక్కడ మనుష్యుల ఒళ్ళ మీద సరిగ్గా బట్టలైనా లేవు. ఆ చనిపోయిన ఆసామీ వుండే వూళ్ళోకిపోయి, ఇళ్లని, మనుష్యులని సోదా చేసి 'ఆరా' తీయ ప్రయత్నించారు; ఆ కుటుంబం పోలీసులని చూచి మరీ బెంబేలెత్తి పోయేరు. మరీ గోలుమన్నారు. తాపీగా నిలదీసి అడిగేసరికి ఒక చిన్న విషయం తేలింది.

స్టేషన్ మాస్టరు మూర్తికి, ఆ చచ్చిన వాడికిన్ని స్నేహమనీ, ఆ స్టేషన్ మాస్టరికి బాగా తాగుడు అలవాటుందని - యీ వూళ్ళో త్రాగేవాళ్లతో నీ అతనికి జోక్యం వుందని - అందరినీ తీసుకువెళుతూ,

కలిసి తిరుగుతూ వుంటాడని - యీ చనిపోయిన ఆసామికి ఆ మేష్టరికి ఒకనాడు ఏదో చిన్న జగడం వచ్చి మాటామాటా అనుకోగా ''స్టేషన్‌వైపు రావా ?'' అని ఆ మేష్టేరు అన్నాడని, అంతకు మించి విరోధం ఎవ్వరితోనీ అతనికి లేదని తెలిసింది.

త్రాగుడు కొద్దిగా అలవాటున్నా, వాళ్లతో పరిచయంవున్నా ఖూనీ చేసేంతటి ఖర్మంగాని, వైషమ్యం గాని తనకు లేదని, మాటమీద మాటగా ఆ రోజున వాడిని అలా కోపంతో అన్నా. తర్వాత మళ్లీ యధాప్రకారంగానే స్నేహంగా వున్నామని, ఆ స్టేషను మాష్టరు చెప్పుకొన్నాడు.

ఒకనాడు నిర్జనపూర్ స్టేషన్‌లో - అందరూ చూస్తూండగా, టిక్కెట్టులేదని ఒక ముష్టివాడిని, మధ్యాహ్నం బండిలోంచి టిక్కట్టు కలక్టరు దింపేసాడు. వాడు నెత్తీ నోరూ బాదుకుంటూ, గోలపెడుతూ, ఎవ్వరికీ తోచనివ్వకుండా స్టేషనంతా అరుస్తూ వైటింగ్ షెడ్‌లోకి వచ్చి గొణుక్కుంటూ కూర్చున్నాడు.

ఆ ముష్టివాడి దగ్గర ఒక చిరిగిన గోనె సంచీ వుంది. అందులో ఏముందో ! సందడి తగ్గాక ఆ ముష్టివాడు మరొకణ్ణి ''దగ్గిరా ఏవయినా వూళ్లున్నాయా'' అని కనుక్కున్నాడు. 'నీకివన్నీ ఎందుకంటే' - నవ్వుకుంటూ ''బాబూ మరిక్కడేందినేదీ పూట !'' అని జవాబు చెప్పేడు. అలాగే ఏవో కబుర్లు చెబుతూ, వాళ్లు విసుక్కుంటున్నా అడుగుతూ, ఎటో వెళ్లినట్టే వెళ్లి మళ్లీ చీకటి పడకుండానే తిరిగి వచ్చి ఆ షెడ్‌లోనే మఖాం పెట్టి పడుక్కున్నాడు.

రాత్రి పది అయి వుంటుంది, వెన్నెల రాత్రేమో అల్లంత దూరంలో వున్న మనిషిని కూడా పోలికపట్టవచ్చు. ఆ సమయంలో స్టేషన్ మాష్టరు మూర్తి, లైను ప్రక్కనుండి వెళుతుండడం కనిబెట్టాడు మన ముష్టివాడు. లేచాడు. ఆ మాష్టరుకి తెలియకుండా, పిల్లి అడుగులు వేస్తూ కొంచెం దూరంలోంచి వెంబడించి వెళ్ళాడు.

★★★

మరునాటి రాత్రి పదిగంటల ప్రాంతంలో ఒక జీపు కారు వచ్చి స్టేషన్ ముందు ఆగింది. స్టేషన్ లోంచి ఎవరూ బయటకు వచ్చి చూడక మునుపే ఆ కారులోంచి యిద్దరు వ్యక్తులు దిగారు. సూటుతో ఉన్న ఆసామి తిన్నాగా స్టేషన్ వైపు నడిచాడు. రెండో ఆసామీ క్రితం రోజు వెళ్ళినట్టే లైను ప్రక్కగా ఔటర్ సిగ్నల్ వైపు గబగబా నడుస్తూ పోయేడు.

సూటుగల వ్యక్తి స్టేషన్ లోపలికి పోయి చిన్న మేష్టర్ని పలకరించాడు.

''నేను స్టేట్ ఇనస్పెక్టర్ని, ఇన్‌స్పెక్షన్‌కి వచ్చేను !'' అన్నాడా క్రొత్త వ్యక్తి. అతనెవడో కొత్త ఆఫీసరులా ఉన్నా, మొహం చూసింది కాకపోయినా యిలాటి వాళ్లని డిపార్టుమెంటు అకస్మాత్తుగా అప్పుడప్పుడు నియమిస్తూండడం అలవాటు కాబట్టి చిన్న మేష్టరు కంగారు పడలేదు.

''స్టేషన్ మాష్టర్ని పిలుస్తారా ?'' అని అతనడిగాడు.

''అలాగే'' అంటూ ఒక పోర్టరుని పంపేడు స్టేషన్ మాష్టరు యింటికి.

అప్పుడే ఎక్కడికో బయలుదేరుతున్న మేష్టరు విసుక్కుంటూ విధిలేక వచ్చాడు స్టేషన్‌కి.

చిన్న మేష్టరా వ్యక్తిని పరిచయం చేశాడు. స్టేషన్ మాష్టరా వ్యక్తిని విష్ చేస్తూ క్రొత్తగా చూశాడు.

''నేను ఈ డిస్ట్రిక్టుకు క్రొత్తవాడిని, యినాళ సర్‌ప్రైజ్ చెక్ చేయవలసి వుంది. ఏదీ మీ ట్రయిన్ సిగ్నలింగ్ రిజిష్టరూ, తలిమ్మా రికార్డులూ యివ్వండి'' అని అంటూ తణికీ చేయ మొదలెట్టాడు. స్టేషన్ మాష్టర్ని వదలకుండా.

అటు లైను వెంట పోయిన మనిషి తిన్నగా వెళ్ళి పరిచయం వున్నట్టు ఆ గోర్జిలోకి పోయి అక్కడ వదునుగా చెక్కబడిన చోటులో ప్రక్కవాటుగా నుంచున్నాడు - ఎవరికోసమో! కొంత సేపయ్యాక ఒక స్త్రీ దగ్గరా వచ్చి, ఆ క్రొత్త వ్యక్తిని చూసి గతుక్కుమని వెనకడుగు వేసింది.

''అడిగిన వాటికి జవాబు చెప్పు! నేను పోలీసువాడ్ని. సరి అయిన జవాబిచ్చావా ఫరవాలేదు, లేదా నిన్ను జైలుకి పంపిస్తాను!' అన్నాడతను గట్టిగా. ఆమె కొంచెం భయపడింది.

'ఇక్కడికెందుకు వచ్చావు. నీ పేరేమిటి?' అడిగాడతను.

'నా పేరు కాంతం,' అందామె వణికిపోతూ.

'ఆ స్టేషన్ మాష్టర్ కోసం వచ్చేవు కదూ?'

అది విని ఆమె మాట్లాడలేదు. సిగ్గుతోను, కంగారుతోను తలదించుకుంది.

'నీకెవరైనా ఉన్నారా! అంటే భర్త వగైరా -'

'భర్త ఈ మధ్యనే రైలు కిందపడి చనిపోయారు!'

'నీకు స్టేషన్ మాష్టర్‌తో సంబంధం ఎన్నాళ్ళ బట్టీ ఉంది?''

ఆమె మాట్లాడలేదు.

''కాంతం! నువ్వు చెప్పకపోతే రహస్యాలు దాగుతాయని అనుకోవద్దు. ఆ రాత్రి నువ్వు స్టేషన్ మేష్టరు కోసం ఇక్కడికి వచ్చావ్. నీ వెనకే నీకు తెలియకుండా, నీ భర్త వచ్చాడు. తర్వాత ఏం జరిగిందో, నిజం చెప్పు. చెప్పకపోతే అనవసరంగా జైలు కెళ్ళాల్సి వస్తుంది.''

'ఆ నాటి రాత్రి యిలాగే నేనూ మేష్టరు గారూ, యిక్కడికి వచ్చాం! కొంతసేపటికి అదిగో ఆ దిబ్బమీద నుండి మా ఆయన కర్ర పట్టుకు గెంతి పులిలాగ వచ్చి మాష్టరుగారిని కొట్టబోయేడు. యింతలో అదేం చిత్రమో మేం ఇద్దరం ఆశ్చర్యపడుతూండగా మరొక మనిషి ఎవరో గభాలున వచ్చి ఆ దిబ్బ మీదనుండే మా ఆయన తలపై కొట్టేసి పారిపోయాడు. మా ఆయన పడిపోయేరు. మా యిద్దరికీ ఏం చెయ్యడానికీ తోచలేదు. యింకా అక్కడే ఉంటే ఏం వస్తుందోనని మాష్టరుగారు, స్టేషన్‌లోకి, నేను మా యింటికీ పరుగెత్తుకు పోయాం!'

'ఇది నమ్మతగ్గ కథేనా?' అన్నాడా మనిషి!

'కథ కాదు బాబూ నిజం! యింత కన్నా, మీతోడు నేనేం ఎరగను' అందామె.

'సరే నువ్వింక వెళ్లు' ఇక్కడ ఇంకా ఉండడం మంచిదికాదు,' అని అతను వెనక్కి తిరిగాడు.

స్టేషన్‌లో సూటు మనిషి యింకా ఆ స్టేషను మాష్టర్ని వదలలేదు.

అంతలో అక్కడ కాంతాన్ని కలిసివచ్చిన వ్యక్తి లోపలికి వచ్చి ఒక కాగితం, లోనున్న ఇన్‌స్పెక్టర్‌కి ఇచ్చాడు. అతడా కాగితం చూసి -

'మాస్టరుగారూ! మిమ్మల్ని ఎరెస్టు చేస్తున్నాం!' అన్నాడు. అకస్మాత్తుగా - పిడుగులాంటి ఆ మాట విని స్టేషన్ మాస్టర్ కంగారెత్తిపోయి ఏం తోచక - 'ఎందుకు?' అని అడిగాడు.

'మాస్టరుగారూ! నేను మీ ఆఫీసర్ని గాను. మే మిద్దరం పోలీస్ ఇన్‌స్పెక్టర్లం. - ఒక విషయం మీద అనుమానం కలిగి ఈ రాత్రి మీరు కాంతం కోసం వెళ్ళబోయే ప్రయత్నాన్ని ఆపడానికి ఈ విధంగా వేషం వేస్తేనే గాని జరగదని నేను మీ ఆఫీసరుగా వచ్చేను. యీలోగా ఇతను మీరు రోజూ వెళ్లే చోటికి వెళ్ళి కాంతాన్ని, కలుసుకుని విషయం అంతా తెలుసుకొని చక్కా వచ్చాడు,' అన్నాడతను.

'ఇంతవరకు జరిగింతర్వాత అబద్ధాలాడి ప్రయోజనంలేదు. నేను ప్రమాణ పూర్తిగా జరిగింది చెబుతున్నాను వినండి!' అని ఆ స్టేషన్ మాస్టర్ కాంతం చెప్పినట్టే చెప్పాడు. కాని ఆ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కి నమ్మకం కలగలేదు.,

'మాస్టరుగారూ! అబద్ధాలు ఆడకండి! ఇలా టిపి దాగేది కాదు, పాపానికి ప్రాయశ్చిత్తం తప్పదు. మీరేమయినా చెప్పుకోవలసి ఉంటే కోర్టులో చెప్పుకోండి! మిమ్మల్ని ఎరెస్టు చేయక తప్పదు. మీరే హత్య చేసినట్టు మా దగ్గర ఋజువు వుంది. త్వరలో మా ఇన్‌స్పెక్టరు గారు కూడా వస్తారు' అని అంటూండగా పోలీస్ ఇన్‌స్పెక్టర్ నలుగురు పోలీసులతోనూ ఒక స్త్రీ, ఒక పురుషునితోనూ అక్కడికి వచ్చాడు.

అసిస్టెంట్లు ఇద్దరూ వచ్చి ఇన్‌స్పెక్టర్‌కి శాల్యూట్ చేశారు.

'మాస్టరుగారిని విడిచి పెట్టండి - అసలు వాళ్లను నాతో పట్టుకు వచ్చాను' అన్నాడు ఇన్‌స్పెక్టర్. అది విని అందరూ ఆశ్చర్యపోయారు.

''రక్షించారు బాబూ! అమాయకుడ్ని. ఆజన్మాంతం మీకు కృతజ్ఞుడిని.'' అని చేతులు పట్టుకుని అభినందిస్తూ, మిమ్మల్ని ఎక్కడో చూచినట్టుంది' అన్నాడు స్టేషన్ మాస్టరు.

'ఎక్కడో ఎప్పుడో కాదు. ఇక్కడే నిన్న మధ్యాహ్నమే. ముష్టివాడి వేషంలో చూశారు! యిక్కడకి వచ్చినప్పటినుండి అందరి సంగతుల్లూ ఒక కంట కనిపెడుతూనే వున్నాను! రాత్రి పూట మీరు లైను మించి నడిచి వెళుతూండడం, చూచి అనుసరించి విషయం ఏమిటో గ్రహించాను. అప్పుడు నేను కూడా, ఆమె మోజు మీద మీరే ఈ హత్య చేసేరేమోనని అనుమానించకపోలేదు! కాని తరువాత యీ చుట్టుప్రక్కల ఊళ్ళన్నీ పోయి అందరి దగ్గరా సాధ్యమయినన్ని విషయాలు గ్రహించేను, అప్పుడే కాంతం భర్త బాగా తాగుతాడని ఎల్లప్పుడూ ఎదురుగుండా ఉన్న ఆ పల్లెటూరిలో ఉంటాడనీ, కాంతంకి, మీకు సంబంధం ఉన్నట్టే అతనికి ఆ ఊరిలో ఉన్న చిన్నమ్మ అనే ఆమెకీ సంబంధం ఉందని తెలుసుకున్నాను.

అప్పటి నుండీ ఈ హత్యకి గల కారణాలు నేనూహించడం మొదలు పెట్టేను. కాంతం భర్త అనగా నారాయణప్ప మీకూ కాంతంకు గల సంబంధం తెలిసి మిమ్మల్ని చంపడానికి అక్కడికి వచ్చి వుంటాడని, కాని మరొక విధంగా జరిగి తనే చచ్చి ఉంటాడని తోచింది. ఎందు చేతంటే మీరు కాంతాన్ని కలుసుకోడానికి వెళ్ళినప్పుడు ఎలాంటి ఆయుధమూ వెంట తీసుకు వెళ్లరు. పైగా నారాయణప్ప తల మీద వెనకభాగాన దెబ్బ తగిలి ఉంది. మీరు కొడితే ముందు ప్రక్క తగిలి ఉండాలి. పైగా ఆకస్మాత్తుగా

అనుకోకుండా మీదకి ఆయుధంతో వచ్చిన వ్యక్తిని కొట్టగలగటం అసంభవం. అందు చేత నాకు మరొక అనుమానం కలిగింది. నారాయణప్పకీ చిన్నమ్మకీ గల సంబంధం తెలిసి, నారాయణప్ప తలపెట్టినట్టే చిన్నమ్మకి సంబంధించినవాడు, నారాయణప్పని హతమార్చడానికి పూని ఉండవచ్చునని ఊహించాను.

ఈ ఊహ మీద పరిశోధన ప్రారంభించాను. దానిమీద చిన్నమ్మ ఉండే వూరికి మొదట పోలీసుల్ని పంపి అలజడి లేవదీశాను. దొంగతనంగా చిన్నమ్మ ఇంటికి వెళ్ళి వారిలో కలిగే మార్పుల్ని జరగబోయే విశేషాల్ని కనిబెడుతున్నాను. నిజంగా వాళ్లకా హత్యతో సంబంధం ఉంటే పోలీసులు చేసిన హడావుడికి తప్పకుండా వాళ్లు భయపడతారని వారిలో ఏదో ఒక మార్పు రాక తప్పదని నా వూహ.

ఈ ఆలోచనతో చిన్నమ్మ యింటికి వెళ్లేను. గుమ్మం ఎక్కుతూ తక్కున ఆగిపోయాను. లోపలనుండి ఏవో కేకలు వినవస్తున్నాయి! చెవులు రిక్కించి వినసాగాను.

'నిండు ప్రాణం తీశావు! నీ చేతులు పడ! నిన్నా భగవంతుడు సూత్తాడులే!' ఆడకంఠం.

'ఏటేవ్ ఒద్దంటే మళ్ళీ ఆ వూసె ఎత్తుకుంటావ్! అసలు నిన్నే చంపేసి ఉండాల్సింది. రంకులంజా! నీ మొఖానికి ఆడోకడా! నువ్వు మంచి పని చేసినట్టు నన్నంటావ్!' త్రాగిన మగ కంఠం.

'నువ్వేటి మా గొప్ప నిజాయితీగా బ్రతికేడుతున్నావని? ఈ ఛ్చనం ఎల్లి పోతాను. నువ్వొగ్గి. మళ్లీ పెద్ద కబుర్లు చెబుతావ్! ఎందుకంత భయం! నన్నొగ్గేస్తే అసలు సంగతంతా సెప్పేత్తానని! .... పమానం చేసి సెప్పమంటేనే చెప్పేస్తా! నాకేటి భయం. నా మనసిచ్చినోణ్ని సంపేసేవు! నేనుంటేయేటి, సస్తేయేటి! అదేదో చెప్పేసే సత్తా!'

'ఏటేటీ నిన్ను ప్రాణాలతో ఒగ్గులానేటే నిన్నీఛణం నరికేత్తా!'

అంతలో లోపల్నించి కేకలు వినబడేసరికి నేను పిస్తోలుతో తలుపులు తోసుకుని లోపలికి వెళ్ళాను. నన్ను చూడగానే వాడు పారిపోడానికి ప్రయత్నించాడు. కాని నేను విజల్ ఊదగానే పోలీసులు వచ్చి వాడికి బేడీలు తగిలించేశారు,' అని తనతో తీసుకువచ్చిన చిన్నమ్మని, ఆమె భర్త సన్యాసిని చూపించాడు.

న్యాయస్థానంలో చిన్నమ్మ యీ విధంగా చెప్పింది.

'నాకూ నారాయణప్పకీ సంబంధం వుండటం నిజమే!' ఆడికీ, మా సన్నాసికీ మంచి స్నేహం వుండేది, కొన్నాళ్లకి మా సంగతి సన్నాసికి తెలిసిపోయింది. మా యిద్దర్నీ చంపేత్తానని బయ పెట్టేడు. అంటే నే సెప్పేను కదా - నారాయణప్పతో లెగిచిపోతానని - మరేటనుకున్నాడో ఏటోగాని అప్పటి కూరుకున్నాడు. మేమిద్దరం మరే అడ్డు లేకుండా పబ్లిగ్గా వుండేవాళ్లం. కాని యీ సన్నాసి ఒకనాడు నారాయణప్పతో పెద్ద జట్టీ ఆడీ, ఆడిని బాగా తన్ని పంపేసాడు. 'నీ ప్రాణం తీత్తా. మళ్లీ ఒచ్చావంటే!' అని బయ పెట్టేడు. అయినా నెక్క సేయక నారాయణప్ప ఒకటి రెండు సుట్లు ఒచ్చి ఎల్లాడు.

ఒకనాడు రేతిరి పది అవుద్ది. నారాయణప్పని పట్టుకొని తీసుకొచ్చేడు. యింటికి - అడ్ని సూసేసరికి నాకు బయమేసింది. తలనిండా రక్తం కారుతోంది. ఏటయిందంటే ఎవడో కొట్టేసినాడు. తల పగిలింది. సూసి తీసుకొచ్చానని చెప్పాడు సన్నాసి. నలుగుర్ని పిలుద్దామని అంటే వద్దన్నాడు తగ్గిపోగానే ఎల్లిపోతాడు. అని నాతో చెప్పి ఆడిని మంచం మీద తొంగో పెట్టినాడు.

నా దగ్గరకొచ్చి - ఎవరితోనన్నా చెప్పావంటే తంతానన్నాడు. నేబయపడి అలాగేనన్నాను. నారాయణప్పని ఆడు అక్కడికి తీసుకొచ్చినట్లు మరోరికీ తెలీదు. నారాయణప్ప ఆ రాత్రల్లా వుండి, ఆ మర్నాడు కూడుతినే ఏల సచ్చాడు - ఆ సంగతి సన్నాసి నాకు చెప్పలేదు - సన్నాడి దగ్గరికి ఎల్లనీలేదు. ఆడు వదలకుండా, అక్కడే కూకున్నాడు. నేను బయంతో నా పని నేను చూచుకుంటున్నాను. రాత్రి ఎనిమిదవుద్ది. మళ్లీ తిరిగొచ్చి చూసేసరికి అక్కడ సన్యాసి లేడు. నారాయణప్ప శవమూ లేదు. 'ఇదేటి సెప్మా అని సూసేసరికి మా గొడ్ల పాకలో ఏదో సప్పుడవుతోంటే ఎల్లి చూసేను. కాని తలుపులేసి వున్నాయి. ఆ సీకట్లో ఏం కనబడనేదు!

మరి ఆడేం చేశాడో యింతకన్నా నాకేం తెలీదు!

సన్యాసి యింక తప్పదనుకుని యిలా చెప్పాడు.

'నారాయణప్ప ఆడి పెల్లాన్ని ఆ స్టేషను మేస్త్రరి కప్పజెప్పి, నా పెల్లాం మీద పడ్డాడు. యీ సంగతి నాకు తెలిసి, అదమాయించి నే మంచోణ్ని కాదు వదలుకో అని సెప్పేను. ఆడదీ ఇనుకోలేదు. ఆడిని ఎలాగైనా సఫా చెయ్యాలని బుద్ధి పుట్టింది. కాని ఆడికీ, ఎవరికీ అనుమానం రాకుండా సేసేదేదో సెయ్యాలని అనుకున్నా.

ఆ రాత్రి తొమ్మిది దాటాక, నారాయణప్ప బయలుదేరి ఆ లైను ప్రక్క గోర్జి దగ్గరికి ఎల్లడం చూశాను. నేను ఎనకే వెళ్ళాను. అప్పటికి ఆ మేస్త్రారూ, కాంతమ్మా రాలేదు. నారాయణప్ప ఆ దిబ్బ ప్రక్కనే దాక్కున్నాడు. నేనూ ప్రక్కనే తుప్పలో కూకున్నాను! కొంత సేపటికి ఆలిద్దరూ వచ్చారు. ఇంతలో మెరుపులా నారాయణప్పలేచి ఆ మేస్త్రరు తలకాయమీద కొట్టబోయినాడు! ఆ సమయంలోనే నా ప్లాను ప్రకారం నేను అంతకుముందే తుప్పల్లోంచి, నారాయణప్ప లేచీలేవగానే తలకాయ మీద యిచ్చుకున్నాను. దాంతో ఆడక్కడ పడిపోనాడు. కొట్టడం కొట్టేశానుగాని అక్కడుండటానికి భయమేసి పారిపోనాను.

నేనేటనుకున్నానంటే అలాగ నారాయణప్పని కొట్టేస్తే చస్తే చస్తాడు. చచ్చినా ఆడి పెళ్ళానికీ, టేసను మాష్టరుకీ సంబంధం వుంది కాబట్టి ఆ మేష్టరే కొట్టి ఉంటాడని పోలీసులు ఆడిమీదకే ఎలతారని అనుకున్నాను - అదీ నా ప్లాను. నేనలా పారిపోయినానుగాని నాకు మళ్ళీ భయమేసింది. ఎందుకంటే ఒకేల ఆడు చస్తాడో లేదో ఆ ఒక్క దెబ్బతోనే చావకపోతే నేనే కొట్టానని చెప్పేస్తాడు. అప్పుడు పోలీసులు నన్నొట్టుకుంటారు అని భయమేసి తిరిగి అక్కడికొచ్చి నారాయణప్పని తీసుకొని ఇంటికి పోయేను. అక్కడాడు చచ్చాడు. ఆ సంగతి ఎవరికీ చెప్పకుండా ఆడినెలగయినా ఎక్కడైనా కామాపు సేసెయ్యాలని అనుకొన్నా! ఎలాగ! - ఆలోచిత్తే ఒక ఉపాయం తోసింది!

పీక కోసి పట్టాలమీద పడేస్తే - ఏ రైలు కిందో పడి ఉంటాడని అనుకుంటారు గదా, మరే

చిక్కూ ఉండదని అనుకుని ఆ రాత్రి రాత్రి మా గొడ్ల పాకలోకి ఆ శవాన్ని మోసుకుపోయి పీక కోసేసా! అప్పటికే సాలా సేపయి సచ్చినోడు కాబట్టి నెత్తురయినా లేదు! సొరకాయ తెగినట్టు సల్లగా తెంపేసి ఏరికీ అనుమానం ఎయ్యకుండా బండి మీద పడేసి గడ్డి బాగా కప్పేశాను - కప్పేసి బండి తోలుకొని ఆ లైను పక్కకొచ్చి లైను మీద ఆడుకోరుండి పడినట్టే మొండెం బుర్ర పడేసి వచ్చాను! ఇంత జాగర్తగా చేసినా తస్సాదియ్యా ఎలా తెలిసిందో ఏటో మరి!'

★ ★ ★

*(పరిశోధన, 8-1961.)*